



తిరుమలలో కుటుంబ సమేతంగా మంత్రి వివేక్ వెంకటస్వామి

తీగల్‌పహాడ్ పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం



తీగల్‌పహాడ్ పాఠశాలలో గ్రంథాలయంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నస్పూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సంధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వామన్‌రావుల ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులోకి తెచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో 68 మంది విద్యార్థులు నూతనంగా చేరారని పాఠశాల హెచ్‌ఎం వామన్‌రావు తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రతీరోజు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి వేణుగోపాల్ రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలి

మంచిర్యాలక్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన పోస్టులకు పరీక్ష రాసిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న రాతపరీక్ష రాసిన అభ్యర్థులు రోస్టర్, మెరిట్ ఆధారంగా 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపిక చేసిన తాత్కాలిక జాబిత వెబ్‌సైట్‌లో పొందుపరచామన్నారు. కార్యాలయ నోటీసు బోర్డుపై సైతం ప్రదర్శించామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు జిల్లా విద్యాధికారి ఆఫీసు ఐడీఓసీ మంచిర్యాలలో ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు ఒక జిరాక్స్ సెట్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

ఎరువుల విక్రయ కేంద్రాలు తనిఖీ



ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీలు చేస్తున్న ఏవో అనిత

జన్నారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో వ్యవసాయ సహాయసంచాలకులు అనిత ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన బ్యాగులను, పత్తి విత్తన ప్యాకెట్లను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. బిల్లులు తప్పనిసరిగా విక్రయకేంద్రాల నుంచి తీసుకోవాలన్నారు. విత్తనాల్లో లోపం గాని కల్తీ విత్తనాలు వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమిలో నత్రజని పెరుగుతుందని తెలిపారు. రైతులు ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన బిల్లులను భద్రపరుచుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాధికారి సంగీత తదితరులు ఉన్నారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట ఏజెన్సీ గ్రామపంచాయతీలో గిరిజనులైన అర్హులకు కాకుండా ఇతరులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని బీజేపీ బూత్ లెవల్ అధ్యక్షుడు ఏముర్ల ప్రవీణ్, మండల అధ్యక్షుడు దూడపాక భరత్ గురువారం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందించారు. అనతంరం వారు మాట్లాడుతూ కిష్టంపేట ఏజెన్సీ గ్రామంలో కేవలం ఏడుగురికి మాత్రమే ఇళ్లు ఇవ్వడం చాలా బాధకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు కుమ్మక్కై ఇతర కులాల వారికి ఆర్థికంగా స్థిరపడిన వారి వద్ద డబ్బులు తీసుకుని ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబ సభ్యుల పేర్లపై ఇళ్లు తీసుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, ప్రదీప్, విజయ్‌కుమార్, శేషగిరి, మల్లేష్, శ్రీనివాస్, ప్రసాద్, విగ్నేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులను తీసుకెళ్లవద్దు

బెల్లంపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఆటోడ్రైవర్లు పాఠశాల విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లవద్దని ఆటోయూనియన్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు కట్ట రాంకుమార్ సూచించారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహదారి నిబంధనల ప్రకారం ఆటోల్లో విద్యార్థులను తీసుకెళ్లాలని పరిమితికి మించి తీసుకెళ్లవద్దన్నారు. ఆటోడ్రైవర్లు పాఠశాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అతివేగంగా వెళ్లవద్దని డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ ఉన్నవారే ఆటోలను నడిపించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే ఆటో యూనియన్‌లో సభ్యత్వం రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న అధికారులు'

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో గల ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, టై, బెల్ట్, షూలకు ఐదువేల రూపాయల నుంచి 15వేల రూపాయల వరకు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో పుస్తకాలు అమ్మే విధానం లేదని కానీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాత్రం విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌డీ జిల్లా కార్యదర్శి సన్నిగౌడ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు సికిందర్, సుమన్, మణిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

సందిగ్ధంలో 'స్థానికం'

- స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- నెలాఖరులోగా నోటిఫికేషనంటూ మంత్రి పొంగులేటి ప్రకటన
- టీపీసీసీ చీఫ్ కౌంటర్‌తో అయోమయం
- ఎన్నికలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- బీసీ రిజర్వేషన్లు తేల్చాకే వెళ్లాలంటూ నిరసనలు



మంచిర్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణపై సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. కొంతకాలంగా తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతుండగా, ఈ విషయమై ప్రభుత్వం ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. ఈ నెలాఖరులోగా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ ఉంటుందని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం నిండింది. అయితే కోర్టులో ఉన్న అంశాన్ని తనకు సంబంధం లేని శాఖపై ప్రకటన ఎలా చేస్తారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ మంత్రితి పొంగులేటి ప్రకటనపై కౌంటర్ ఇవ్వడంతో ఎన్నికల నిర్వహణ సందిగ్ధంలో పడింది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42శాతం ప్రకటిస్తూ చట్టబద్దత కోసం కేంద్రానికి పంపింది. దీంతో బీసీ రిజర్వేషన్లు తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ కొద్ది రోజులుగా నిరసన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. దీంతో అసలు స్థానికసంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియక ఆశావహులు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్రంలో చివరిసారిగా 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగగా, 2024 ఫిబ్రవరి 1వతేదీన సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా, ఎంపీటీసీ, ఎంపీపీల పదవీకాలం జూలై3న ముగిసింది. అలాగే జడ్పీటీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్ల పదవీకాలం అదే సంవత్సరం జూలై4న ముగిసింది. ఆగస్టులో మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియడంతో అప్పటి నుంచి ప్రభుత్వం స్థానికసంస్థల్లో ప్రత్యేకాధికారులను నియమించింది. రాష్ట్రంలో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి సంవత్సరం కావస్తున్నందున స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రభుత్వానికి అనివార్యంగా మారింది.

పూర్తయిన ఏర్పాట్లు...

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా జిల్లా అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతో ఉంది. ఆ దిశగా అవసరమైన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా ఓటరు జాబితాను కూడా సిద్ధం చేశారు. జిల్లాలో 16 మండలాలు ఉండగా, 306 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 16 జడ్పీటీసీ, 16 ఎంపీపీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 130 ఎంపీటీసీ స్థానాలు ఉండగా మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్‌లో..

మిగతా 7లో

తిరుమలలో మొక్కులు చెల్లించుకున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి గురువారం తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన తిరుమలకు కుటుంబ సమేతంగా వెళ్లారు. ఉదయం వీఐపీ విరామ సమయంలో మొక్కు లు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు బాగుండాలని కోరుకున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక పరిపుష్టి సాధించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అర్హులందరికి సంక్షేమపథకాలు సక్రమంగా అందేలా చూస్తున్నామని తెలిపారు. అంతకు ముందు మంత్రికి తిరుమలలో మాలమహానాడు నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

సాగులో ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలి

నెన్నెల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న నిరుపేదలందరికి పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోడు సాగు చేసుకుంటున్న దళిత, గిరిజనులను అక్రమకేసులు పెడుతూ అటవిశాఖవారు వేధిస్తున్నారని అన్నారు. భూభారతిలో అర్హులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు. పట్టాలు సాధించేందుకు తమ సంఘం ఆధ్వర్యంలో 25న తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తిరుపతి పేర్కొన్నారు.

రుణాల చెల్లింపులో మహిళ సంఘాలు కీలకం

- ఆర్బీఐ ఏజీఎం ఎఫ్ఐడీడీ శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీఐ ఏజీఎం ఎఫ్ఐడిడి శ్రీరాములు

నస్పూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకుని క్రమ పద్ధతిలో చెల్లిస్తూ రాష్ట్రంలో జిల్లా సంఘాలు ముందు వరుసలో ఉన్నాయని రిజర్వు బ్యాంకు ఏజీఎం ఎఫ్ఐడీడీ శ్రీరాములు అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు గురువారం తీగల్ పహడ్ రాంనగర్‌లో ఆర్థిక అక్షరాస్యత ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఏజీఎం శ్రీరాములు మాట్లాడుతూ మహిళలు రుణాలు తీసుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు, ఖాతాదారులకు లభించే రుణాలు, ఇన్సూరెన్స్, అటల్ పెన్షన్, డిజిటల్ లావాదేవిల గురించి వివరించారు. సమావేశంలో జిల్లా బ్యాంకుల సమన్వయ అధికారి తిరుపతి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ నిర్వహణ అధికారి నరసింహస్వామి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహణ అధికారి సాగర్, ఆర్థిక అక్షరాస్యత ప్రతినిధులు స్వరూప, రాజశేఖర్, టీఎంసీ నాగరాజు, రిసోర్స్ పర్సన్లు, మహిళ సంఘాల ప్రతినిధులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా బీజేపీదే గెలుపు

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

లక్షెట్టిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలే కాకుండా ఏ ఎన్నికలు నిర్వహించిన భారతీయజనతాపార్టీ గెలుపు ఖాయమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్‌లో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ 11ఏళ్ల పాలనలో దేశ ప్రజల సంక్షేమం, దేశ రక్షణకు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు ప్రధాని మోదీ అని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోరే పార్టీ బీజేపీ అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించాలనే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమచేస్తోందన్నారు. ప్రజలను ఎంత ప్రలోభపెట్టినా ప్రజల గుండెల్లో బీజేపీ జెండా పాతుకుపోయిందని రానున్న రోజుల్లో బీజేపీదే విజయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్, నాయకులు హేమంత్‌రెడ్డి, ముత్తె సత్తయ్య, బొప్పుకిషన్, తమ్మినీడి శ్రీనివాస్, మోటపలుకుల గురువయ్య, గాజుల ముఖేష్‌గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, బియ్యాల సతీష్‌రావు, స్వామిరెడ్డి, వీరమల్ల హరిగోపాల్‌రావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాల అభివృద్ధి

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీతోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగా నాయకత్వాన్ని 11ఏళ్లుగా పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 81కోట్ల మంది పేదలకు ఉచిత..

మిగతా 7లో..

సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు చర్యలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, డీఎంహెచ్‌వో

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ తెలిపారు. ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గిరిజన సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 2047 నాటికి సికిల్ సెల్ ఎనిమియాను పూర్తిగా నివారించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని దండేపల్లి, కాసిపేట, తాళ్లపేట, మందమర్రిలోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 40 సంవత్సరాలలోపు వయసున్న గల వారందరికీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అహగాహన కల్పిస్తున్నామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆరోగ్య కేంద్రాల్లో మందులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. సికిల్ సెల్ ఎనీమియా నివారణ కోసం ప్రతి ఇంట్లో ఆకుకూరలు, కూరగాయలు పెంచేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి జనార్దన్, వైద్యాధికారులు సుధాకర్‌నాయక్, అనిత, కృపాబాయి, వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి..

నెన్నెల (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ అనిమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహనకలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సికిల్ సెల్ అనిమియా దినోత్సవం సందర్భంగా గురువారం జంగాల్‌పేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వ్యాధి సోకిన వారిలో రక్తహీనత తలెత్తుతందని..

మిగతా 7లో..

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

- రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డు లేక పొంచి ఉన్న ప్రమాదం



రెబ్బనపల్లి నుంచి వెల్గనూర్ వెళ్లే రహదారిని అనుకొని ఉన్న వ్యవసాయ బావి

దండేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రెబ్బనపల్లి నుంచి వెలనూర్ వెళ్లే రహదారి, ద్వారాక నుంచి కొండాపూర్, మేదరిపేట నుంచి గూడెం రింగ్ రోడ్డుకు వెళ్లే రహదారి పక్కనే పంట పొలాలకు ఆనుకొని వ్యవసాయబావులు ప్రమాదకరంగా మారాయి. ఈ బావుల ఇరువైపులా కంపచెట్లు, చెట్ల పొదలు పిచ్చి మొక్కలు కమ్ముకొని ఉండడంతో వాహనదారులు వీటిని గుర్తించేందుకు ఆస్కారం లేకుండా పోయింది. బావులకు రక్షణగోడలు లేకపోవడం, కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా దారుల గుండా ప్రయాణించే వారు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు రహదారులను ఆనుకొని ఉన్న వ్యవసాయ బావులను గుర్తించి రక్షణ గోడలను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడితే వాహనదారుల ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు. ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి మేదరిపేట నుంచి గూడెం రింగ్ రోడ్డు పక్కన పంటపొలాలకు అను కోని ఉన్న వ్యవసాయ బావులను గుర్తించి అక్కడ రక్షణ గోడలు నిర్మించాలని ఆయా గ్రామాల వాసులు వాహనదారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఈసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం టీఎస్‌ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు మొత్తం 564 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. సంబంధిత అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించామని తెలిపారు.

'రైతు భరోసా' దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా పథకం కోసం అర్హులైన రైతుల నుంచి ఈ శుక్రవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా వ్యవసాయాధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5, 2025 నాటికి నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాలో నమోదు చేసుకోవాల న్నారు. దరఖాస్తు ఫారం, పట్టాపాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతాలతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడి

మంచిర్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం బైపాస్ రోడ్‌లో నస్పూర్‌లకు చెందిన దగ్గుల మధుపై గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి దాడిచేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మధు తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మధుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. కక్షపూరితంగా కాంగ్రెస్ నాయకులు తనపై దాడికి పాల్పడ్డట్టు బాధితుడు మధు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విజిత్ వెంట తిరుగుతున్నందుకే తనపై దాడి చేశారని మధు ఓ వీడియో విడుదల చేశాడు. తనకు ప్రాణ హాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలని మధు పోలీసులను వేడుకుంటున్నాడు. తనకు ఏం జరిగినా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుదే బాధ్యత అని తెలిపారు. బాధితుడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడిపై మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


శ్రీనివాస్(ఫైల్)

హాజీపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట శివారు బుగ్గగట్టు ప్రాంతంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కల్ల గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీనివాస్(42) అనే వ్యక్తి లక్షెట్టిపేటలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన ద్విచక్రవాహనంపై పనినిమిత్తం లక్షెట్టిపేటకు వెళ్లి బుదవారం రాత్రి తన స్వగ్రామం ముల్కల్లకు తిరిగి వస్తుండగా బుగ్గగట్టు దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్ భార్య బొలిశెట్టి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ స్వరూప్‌రాజ్ తెలిపారు.

మృతుడి బంధువుల ఆందోళన

ప్రమాదం జరిగిన చోటు నుంచి మృతదేహాన్ని తరలించిన అనంతరం స్థానిక పోలీసులు ఆ ప్రాంతంలోని చెట్ల పొదలను తొలగించారు. కాగా సంఘటన స్థలంలో జరిగిన ప్రమాదానికి ఆనవాళ్లు లేకుండా చేశారని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ప్రమాదంపై మాకు అనుమానాలున్నాయంటూ నినాదాలు చేశారు. కాగా సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ సీఐ ఆకుల అశోక్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి అనుమానం ఉంటే ఫిర్యాదు చేయాలని.. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కిష్టంపేట రైతు వేదికలో చోరీ

చెన్నూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప్యూటర్, స్పీకర్లను చోరీ చేశారు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉందని, లోపలికి వెళ్లి చూడగా కంప్యూటర్, స్పీకర్ ఎత్తుకెళ్లినట్లు ఏఈవో సాయికృష్ణ తెలిపారు. ఈవిషయంపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించానని తెలిపారు. కాగా చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గిరిజన గ్రామాలకు మహర్దశ

- పీఎం జుగా పథకం అమలుతో మౌలిక సదుపాయాల కల్పన
- జిల్లాలో 102 గ్రామాలు ఎంపిక
- 30 వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు


పీఎం జుగా పథకం కింద ఎంపికైన జాముల్‌ధర గ్రామం

లింగాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోనున్నాయి. గిరిజన ఆవాసాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు, వారికుటుంబాల సామాజిక ఆర్థిక అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ యోజన (పీఎం-జుగా) పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం, మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్, ఆరోగ్య, పోష కాహార, విద్య, విద్యుత్‌తో పాటు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ఈ పథకం కింద జిల్లాలోని 102 గిరిజన గ్రామాలను ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నిధులు మంజూరు చేయనున్నది. ఇప్పటి వరకు అమలులో ఉన్న పీఎం జన జాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్‌ను ఉన్నతీకరించి ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్‌గా మార్చారు.

● సౌకర్యాల కల్పన ఇలా..

ఆయా గ్రామాల్లో రహదారులు, మరమ్మతు పనులు చేపట్టనున్నారు. సొంతగూడ లేని వారికి పక్కా ఇళ్ల మంజూరుతో పాటు నిర్మాణానికి సంబంధించి ఆర్థిక సాయం అందించనున్నారు. ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరిచేయనున్నారు. సౌరవెలుగులకు అవసరమైన పరికరాలు అందజేయనున్నారు. పూర్తి స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించనున్నారు. ఆయుష్మాన్‌భవ కార్డులు జారీ చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేని చోట ఏర్పాటు చేస్తారు. ప్రతిఒక్కరికీ పౌష్టికాహారం అందజేస్తారు. విద్య, నైపుణ్యాలకు దూరంగా ఉంటున్న గిరిజన గ్రామాల్లో విద్యార్థులకు ప్రత్యేక ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. గిరిజనులు పండించే పంటలను మార్కెట్‌కు తరలించి, వారికి గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటారు.

● ఐదేళ్ల ప్రణాళికతో ముందుకు..

జిల్లాలో ఈ విషన్ ద్వారా రానున్న ఐదేళ్లకాలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో గిరిజనుల సామాజిక ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతారు. ఈ పథకంలో 19 ప్రభుత్వ శాఖలు ఆయా ప్రాజెక్టులు చేపట్టనున్నాయి. ఆయాశాఖలు ఎంపికచేసి గ్రామాల్లో కావల్సిన మౌలిక సదుపాయాల వివరాలు సేకరించి అందజేస్తాయి. ఇందుకోసం ఈనెల 30వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాయి. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికిగల కారణాలు, అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సంరక్షణ సదుపాయాలను పరిశీలిస్తారు. వాటిని నమోదు చేసి ఆయా శాఖల అధిపతుల ద్వారా అక్కడి పనులకు అయ్యే ఖర్చుఎంత అనే అంచనాలు రూపొందిస్తారు. అనంతరం జిల్లా గిరిజనాభివృద్ధి అధికారికి పంపుతారు. వాటన్నింటిని కలెక్టర్ ద్వారా పీఎం జుగా మిషన్ అధికారులకు అందజేసిన అనంతరం వెనువెంటనే వాటికయ్యే నిధులను అందజేస్తారు. ఆ నిధులతో గుర్తించిన పనులు చేపడుతారు. ఈ పనులన్నీ 2029 నాటికి పూర్తి చేయనున్నారు.

● ఎంపిక చేసిన గ్రామాలు..

జిల్లాలోని పీఎం జుగా పథకం కింద ఎంపికైన గ్రా మాలు ఇలా ఉన్నాయి. లింగాపూర్ మండలంలో ఎనిమిది గ్రామాలను ఎంపిక చేశారు. అందులో చోర్‌పల్లి, కంచన్‌పల్లి, కొత్తపల్లి, లింగాపూర్, జాముల్‌ధర, లొద్దిగూడ, వంకమద్ది, గూమ్‌నూర్ బి, ఉన్నాయి. తిర్యాణిలో 33, జైనూర్‌లో 15, సిర్పూర్(యు)లో 14, వాంకిడిలో ఎనిమిది, కెరమెరిలో ఏడు, ఆసిఫాబాద్ మండలంలో నాలుగు, బెజ్జూరులో నాలుగు, కాగజ్‌నగర్‌లో నాలుగు, చింతలమానేపల్లిలో మూడు, రెబ్బెనలో ఒకటి, కౌటాలలో ఒక గ్రామాలను ఎంపిక చేశారు.

జిల్లాలో 102 గ్రామాల ఎంపిక..

- రమాదేవి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్



జిల్లాలో మొత్తం 102 గ్రామాలను ఎంపిక చేశాం. ఈగ్రామాలకు ప్రత్యేకాధికారులుగా ఎస్సీఆర్పీలను నియమించాం. ఇందులో 19 శాఖలను అనుసంధానం చేసి గ్రామాల్లో అవసమైన మౌలిక సదుపాయాల వివరాలు సేకరిస్తున్నాం.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్, పాల్గొన్న సీఐలు దేవేందర్‌రావు, వేణుచందర్

జైపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జైపూర్ ఏసీపీ పరిధిలోని కోటపల్లి మండలంలో గల రాపన్‌పల్లి అంతర్‌రాష్ట్ర వంతెన వద్ద నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయనే సమాచారం మేరకు కోటపల్లి పోలీసులు రాపన్‌పల్లి బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో తనిఖీ చేయగా అందులో నకిలీ విత్తనాలు ఉన్నాయన్నారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గూడ మనోహర్‌రెడ్డిని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద మొత్తం 108 సంచుల నుంచి 48.6 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటివిలువ సుమారు రూ. 1,45,800 ఉంటుందన్నారు. మహారాష్ట్రలోని సిరొంచకు చెందిన చింతవార్ శ్రీనివాస్, సింగిడివార్ నరేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేశారన్నారు. తాండూర్, జైపూర్ పోలీస్‌స్టేషన్లలో సైతం మనోహర్‌రెడ్డిపై నకిలీ విత్తనాల కేసులు ఉన్నట్లు తెలిపారు. కారును స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని తెలిపారు. నిందితులను పట్టుకున్న కోటపల్లి ఎస్ఐ రాజేందర్, సిబ్బంది పిల్లి శ్రీనివాస్, శ్యాంసుందర్, హోంగార్డులు శ్యాం, తిరుపతిరెడ్డిలను ఏసీపీ అభినందించారు. సమావేశంలో చెన్నూరు సీఐ దేవేందర్‌రావు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ఉప కార్యదర్శి గణేశ్ నాగరాజన్, పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్‌మన్, ధర్తీ అబ జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ (జుగా) పథకాల ద్వారా పీవీటీసీలు గిరిజనులు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రభారి గణేశ్ నాగరాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పీవీటీజీలు, ఇతర గిరిజన సామాజిక వర్గాల గ్రామాలలో గృహాలు, తాగునీరు, విద్యుత్, రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మత్స్య సంపద యోజన, పశు సంపద, గ్రామాల్లో సెల్ టవర్ల ఏర్పాటు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం పీవీఈజీలు, గిరిజనుల అభివృద్ధికి చేపట్టిన ప్రధాన మంత్రి జన్‌మన్, జుగా పథకం ద్వారా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఈ నెల 30 తేదీ వరకు జిల్లాలో 102 గిరిజన గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు ఆధార్, ఆయూష్మాన్ భారత్, అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, డీపీవో భిక్షపతి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, డీఎంహెచ్‌వో సీతారాం, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సురేష్, జిల్లా మత్స్య శాఖాధికారి సాంబశివరావు, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని కేంద్ర ప్రతినిధి గణేశ్ నాగరాజన్ అన్నారు. రౌటసంకెపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గిరిజనులకు అందుతున్నా యనా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకు న్నారు. జిల్లాలో 102 గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కోసం ఈ పథకం ప్రారంభించామని తెలిపారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, క్రీడల అధికారి మీనారెడ్డి, ఎస్సీఆర్పీ రవీందర్, అనంత్, కార్యదర్శి మధుకర్, కిష్టయ్య, సుశీల, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి)లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కాగజ్‌నగర్ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యా య పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని డీసీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్(టి)లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఖాళీ ఉన్న టీజీటీ హిందీ, పీజీటీ హిందీ, జేఎల్ సివిక్స్, జేఎల్ హిస్టరీ, టీజీటీ ఇంగ్లీష్‌తో పాటు కాగజ్‌నగర్ బాలికల పాఠశాలలో జేఎల్ ఇంగ్లీష్, టీజీటీ ఇంగ్లీష్ సబ్జెక్టులలో బోధించడానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలని బెల్లంపల్లి సీహెచ్‌పీ సూపరింటెండెంట్ కోటయ్యకు గురువారం హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రసిడెంట్ పతెం రాజబాబు మాట్లాడుతూ సీహెచ్‌పీలో ఆర్‌వోఆర్ వాటర్ ప్లాంటు మరమ్మతులకు గురైందని చెప్పారు. నీటి కోసం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతులు చేయించాలని కోరారు. ఇతర సమస్యలపై దృష్టి సారించాలని తెలిపారు.

మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 21న జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డులో 65 మందికి పైగా ఉద్యోగులను హయ్యర్ రిఫ్టై కోసం వివిధ ఆస్పత్రులకు పంపారని పేర్కొన్నారు.. కానీ ఇప్పటి వరకు వారిని మెడికల్ బోర్డుకు పిలవకపోవడం వల్ల ఆయా ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని, తెలిపారు. సదరు ఉద్యోగులు నష్టపోయిన రోజులను స్పెషల్ లీవ్‌గా పరిగణించాలని, అలా కుదరని పక్షంలో సగం వేతనం ఇవ్వాలని కోరారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

మందమర్రిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల నెరవేరే సందర్భం దగ్గరలోనే ఉందన్నారు. ఇప్పటికే కార్మిక గనుల శాఖ మంత్రిని కలిసి సిం గరేణిలో ఉన్న ప్రధాన సమస్యలను విన్నవించ చామని చెప్పారు. సింగరేణి సంస్థకు ప్రభుత్వ విద్యుత్ సంస్థ ఉన్న 25 వేల కోట్ల బకాయిలను చెల్లిం చాలని ముఖ్యమంత్రిని కోరుతామన్నారు. కార్మికులకు పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమా న్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 35 శాతం లాభాల వాటా చెల్లించాలని కోరారు. ఎస్‌డీఎల్ ఆపరేటర్లకు 2010 సంవత్సరం నుంచి ఇంత వరకు ప్రమోషన్‌లు ఇవ్వలేదని ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలన్నారు. గనుల్లో మ్యాన్‌పవర్ లేదనే సాకుతో పనిభారం మోపడం సరికాదని చెప్పారు. సింగరేణిలో కార్మికుల హక్కులతో పాటు సంక్షేమానికి పెద్దపీట వేసే ఏకైక యూనియన్ ఏఐటీయూసీనేనని అన్నారు. తమను విమర్శించే అర్హత ఏయూనియన్‌కు లేదని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కేకే 5 గని ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్, సోంశెట్టి రాజేశం, మల్లేష్ పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

పర్యావరణ అవార్డులు సాధించిన ఎస్టీపీపీ



అవార్డు అందుకుంటున్న అధికారి జానకిరామ్

జైపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సౌర విద్యుత్ ప్లాంట్‌లు తాజాగా గ్రీన్ ఎన్విరో అవార్డులను అందుకున్నట్లు ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి గురువారం తెలిపారు. మహారాష్ట్రలోని లోనావాలలో గ్రీన్ ఎన్విరో ఫౌండేషన్ నిర్వహించిన ఎన్విరాన్‌మెంట్ అవార్డ్స్ అడ్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో ఎస్టీపీపీకి గోల్డ్ అవార్డు ఇన్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్సీ, సౌర విద్యుత్ ప్లాంట్‌లకు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అవార్డు వచ్చినట్లు తెలిపారు. సీఎండీ బలరాం నేతృత్వంలో ఇప్పటి వరకు సింగరేణి పవర్ ప్లాంట్ వివిధ విభాగాల్లో 52 అవార్డులు అందుకుందన్నారు. అవార్డును సింగరేణి తరుపున జీఎం ఈఅండ్ఎం సోలార్ జానకిరామ్ కేంద్ర మంత్రి సురేష్ ప్రభు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

రెబ్బెన, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగా దినచర్యలో భాగం కావాలని, దీనితో మానసిక ప్రశాంతం లభిస్తుందని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం రెబ్బెన, గోలేటిలో ఏర్పాటు చేసిన వివిధ యోగా శిబిరాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, ఆలేఖ్య, ఎస్ఓటు జీఎం రాజమల్లు, అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): జీఎం కార్యాలయ ఉద్యోగులు, అధికారులు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్సనల్ డీజీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్)గా బదిలీపై వచ్చిన ఎస్. అనిల్ కుమార్‌ను సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్, జాయింట్ సెక్రటరీ గోల్ల మహేందర్, రఘురాం, కోశాధికారి మల్లేష్, సీనియర్ పీవో కాంతారావు, పిట్ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

అధికారులకు ఏఐటీయూసీ నాయకులు..

శ్రీరాంపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాకు నూతనంగా బదిలీపై వచ్చిన డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, పదోన్నతి పొంది ఏరియా రక్షణాధికారిగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్‌లను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి, రక్షణకు అధికారులు కృషి చేయాలని కోరారు.

స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



స్వర్ణత్సోవాల థీమ్‌సాంగ్ ఆవిష్కరిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. సింగరేణి పాఠశాలలో ఆ పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను చాటిచెప్పే థీమ్‌సాంగ్‌సీడీని గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ పాఠశాల శ్రద్ధ, సేవా, నిబద్ధత, విద్యాపరంపరలపై విద్యార్థులు గౌరవభావం పెంపొందేలా థీమ్‌సాంగ్ రూపొందించామని అన్నారు. 50 సంవత్సరాలలో ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ప్రపంచదేశాల్లో స్థిరపడి ఉన్నారని వారు కూడా హాజరవుతారని అన్నారు. ఇందు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సింగరేణి యాజమాన్యం కార్మిక, కార్మికేతర పిల్లల విద్యాభివృద్ధికి సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ సంవత్సరం ఇంటర్‌నేషనల్ స్టాండర్డ్స్‌తో కూడిన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. సీఎండీ బల్‌రాం ఆదేశానుసారం పాఠశాలలో విద్యార్థులకు తగ్గట్టు విద్యాబోధన అందించే సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీసీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సునీల్‌కుమార్, పాఠశాల కరస్పాం డెంట్ శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలి

మందమర్రిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించాలని సూచించారు. అదే విధంగా రైతులకు ఉపయోగపడే పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అందజేత

భీమారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని మార్కెట్ ఏరియాలో గత సంవత్సరం పట్టణానికి చెందిన మాణిక్‌రావు శంకర్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడికి గురువారం ఎస్‌ఐ శ్వేత అందజేశారు.

నోటు బుక్కుల పంపిణీ

భీమారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం కాంగ్రెస్ నాయకులు నోటు బుక్కులు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

మందమర్రిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎనిమిది మెప్మా స్వయం సహాయ సంఘాలకు కోటి రూపాయల చెక్కును యూనియన్ బ్యాంకు అధికారులు గురువారం అందజేశారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రవీందర్, మెప్మా టీఎంసీ రఘురాం, ఆర్‌పీలు పాల్గొన్నారు.

రైతుపై విత్తన భారం

- పెరిగిన ధరలు
- అన్నదాతలపై ఆర్థికభారం
- సబ్సిడీపై అందజేయాలని వేడుకోలు


విత్తనాలు నాటుతున్న కూలీలు

బెల్లంపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా పత్తి విత్తనాలతో ఇతర విత్తనాల ధరలు పెరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలోనే వివిధరకాల విత్తనాల ధరలను కంపెనీలు పెంచడంపై రైతులపై పెట్టుబడి భారం పడుతోంది. ముఖ్యంగా పత్తి సాగుకు అవసరమయ్యే విత్తనాల ధరలు అమాంతం పెరగడంతో ఆందోళనకు గురవుతున్నారు. పెరిగిన ధరలతో జిల్లా రైతులపై కోట్ల రూపాయల భారం పడనుంది.

పెరిగిన విత్తనాల ధరలు...

జిల్లాలో ప్రతి ఏటా 1.50 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేస్తున్నారు. ఎకరాకు మూడుప్యాకెట్ల చొప్పున విత్తనాలు నాటాలి. ఒక ప్యాకెట్‌కు 100 రూపాయలు పెరగడంతో ఎకరాలకు 300 రూపాయలు అదనంగా భారమవుతుంది. ఇప్పటికే మార్కెట్‌లో వందల రకాల పత్తి విత్తనాలు వివిధపేర్లతో డీలర్లకు అందిస్తున్నారు. వారు రైతులకు విక్రయిస్తున్నారు. వీటికి తోడు కొందరు డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మూడేళ్లుగా పత్తి, మిరపతో పాటు ఇతర విత్తనాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ప్రభుత్వం సాధారణ పత్తిసాగుకు విత్తనాల సరఫరాను ఎప్పుడో నిలిపివేసింది. దీంతో రైతులంతా ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా మార్కెట్‌లో బీటీ1, బీటీ2 రకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు బీటీ2 సాగుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వీటికి తోడు వరి, కంది, మిరప విత్తనాల ధరలు పెరిగాయి.

ఐదేళ్లలో పెరిగిన పత్తివిత్తనాల ధరలు ఇలా...

2021లో రూ.750, 2022లో రూ.810, 2023లో రూ.860, 2024లో రూ.890, 2025లో రూ.900 నుంచి రూ.950 ఉన్నాయి. 2023లో కంది కేజీ విత్తనాల ధర 150ఉండగా ప్రస్తుతం రూ.250కి చేరుకుంది. వరి 20 కేజీల సంచి రూ.950 ఉండగా ప్రస్తుతం రూ.1,100లకు చేరుకుంది.

విత్తనాలను ధరలను తగ్గించాలి...

- సంతోష్, రైతు



ప్రతి ఏటా విత్తనాల ధరలతో వ్యవసాయానికి అవసరమయ్యే వివిధ రకాల మందుల ధరలు సైతం పెరుగుతున్నాయి. దీంతో ఆర్థికభారం మోయాల్సి వస్తోంది. పెరిగిన ధరలు, వాతావరణం అనుకూలించక రైతులకు నష్టాలు తప్ప లాభాలు మిగలడం లేదు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

రైతులను ఆదుకోవాలి...

- సదయ్య, రైతు



ప్రతి ఏటా పెరిగిన విత్తనాల ధరలు, మందుల ధరలతోసాగు ఖర్చులు అధికమవుతున్నాయి. విత్తనాలు, ఎరువుల ధరలను ప్రభుత్వం నియంత్రిం చాలి. మార్కెట్‌లోకి నకిలీ పత్తివిత్తనాలు రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలి. తక్కువ ధరలకు విత్తనాలు లభిస్తుండడంతో నకిలీవని తెలియక రైతులు మోసపోతున్నారు.

సందిగ్ధంలో 'స్థానికం'

(5వ పేజీ తరువాయి)

మూడు స్థానాలు విలీనం అయ్యాయి. దీంతో ఎంపీటీసీల సంఖ్య 127కు తగ్గింది. అయితే భీమారం, భీమిని మండలాల్లో ఒక్కొక్క స్థానం కొత్తగా పెరగడంతో ప్రస్తుతం ఎంపీటీసీల సంఖ్య 129కి చేరింది. అలాగే జిల్లాలోని గ్రామాల్లో మొత్తం 3,76,852 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 2,680 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారుల నియామకం కూడా పూర్తయింది. ఎన్నికల కోసం 4,620 మంది పోలింగ్ సిబ్బందిని నియమించగా, వారందరికీ అవసరమైన శిక్షణ కార్యక్రమం కూడా ముగిసింది.

● రిజర్వేషన్ల టెన్షన్..

ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, మునిసిపల్ ఛైర్మన్ పదవులపై ఆశతో ఉన్న నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటన కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో తీసుకొచ్చిన 2019 ప్రత్యేక చట్టం ప్రకారం అప్పటి నుంచి పదేళ్ల వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండబోదు. అయితే రాష్ట్రంలో 2023లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత చట్టానికి సవరణలు చేసింది. ప్రతీ ఐదేళ్లకోసారి రిజర్వేషన్లలో మార్పులు ఉంటాయని ప్రకటించింది. దీంతో 2019లో ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌తోపాటు గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డు సభ్యుల రిజర్వేషన్లు యథాతథంగా ఉంటాయనే భావనలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో వారంతా అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశాలు ఉండటంతో ఆశావహుల్లో అందోళన నెలకొంది. మరోవైపు రేవంత్ సర్కారు బీసీలకు ప్రకటించిన ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. ఈ విషయమై బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

హాజీపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టికానపల్లి గ్రామానికి చెందిన చాకపల్లి సత్తయ్య(45) అనే వ్యక్తి అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాజీపూర్ ఎస్‌ఐ స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం సత్తయ్య కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అప్పులబాధ తట్టుకోలేక ఈనెల 17న ఇంట్లో పురుగుల మందు తాగగా బుధవారం రాత్రి మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు సత్తయ్య కుమారుడు సిద్ధార్థ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి

బెల్లంపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించే సీపీఐ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మాలగురిజాల గ్రామంలో సీపీఐ మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గొమాస గంగారాం, తిరుమలేశ్, మహేశ్, దేవయ్య, చిన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను మండల కార్యదర్శి దాగాం మల్లేశ్ తదితరులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుర్గం సుధాకర్, జాడి పోచం, కుర్సంగి హన్మంతు, దాగాం రాజలింగు, కుర్సింగ సురేందర్, గోదార్ల లింగమూర్తి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి మేదరి దేవవరం, నాయకులు కేతిరెడ్డి రమణరెడ్డి, ఆకుల రామన్న, తిప్పని సత్తన్న, బైరి రాజన్న, ఐలన్న, లచ్చన్న పాల్గొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి మండలంలో సీపీఐ పార్టీని బలోపేతం చేసేందుకు స్థానిక సీపీఐ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం వేమనపల్లిలో సీపీఐ మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అంది పురుషోత్తం, మండల సహాయ కార్యదర్శి శంకర్, నాయకులు బాపు, తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


దేవాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాసిపేట, జూన్19 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ తహసీల్దార్ నాగుల అంజయ్య అన్నారు. గురువారం దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రపంచ యోగా దశాబ్ది ఉత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. యోగా వల్ల ఆరోగ్యాన్ని పొందడమే కాకుండా ఫిట్‌నెస్ సాధించవచ్చన్నారు. నిత్య జీవితంలో అందరూ యోగాను అంతర్భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య భారత్‌ను నిర్మించడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు, ఏఎస్‌వో అమరేందర్, పంచాయతీ కార్యదర్శి కవిత, స్థానిక నాయకులు అడె జంగు, కొడప శ్యాం, సురేందర్, కొమ్ముల బాపు, నగేశ్, యోగా ఇన్‌స్ట్రక్టర్ నాగార్జున, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: కన్నెపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం యోగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్‌కుమార్ హాజరై విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ రజిత యోగాసానాలను వేయించారు. కార్యక్రమంలో స్వర్ణలత, శారద, మాలతి, విశ్వప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

మంచిర్యాలక్రైం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వాసవి క్లబ్ సభ్యులు వంశీకృష్ణ తెలిపారు.

ఈనెల 21 శనివారం మంచిర్యాల పట్టణం లక్షెట్టిపేటలోని వైశ్యభవన్‌లో స్వామి వివేకానంద యోగా, ఓం అష్టోత్తర యోగాపీఠ్, ఫిట్‌నెస్ సెంటర్ మంచిర్యాల వాసవి క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగా దినోత్స వాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


నస్పూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలక్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంచి ర్యాల పట్టణంలో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, పెంట రజిత పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద జరిగిన వేడుకల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సురిమిల్ల వేణు, నాయకులు తాళ్ల సంపత్‌రెడ్డి, సత్యనారాయణ, మధుకర్, పూదరి తిరుపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలో జరిగిన వేడుకల్లో నాయకులు ముచ్చర్ల మల్లయ్య, నాతరి స్వామి, గెల్లి రాజలింగు, నిజాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు ఖైదం రమేశ్, ముత్యాల రాజమౌళి, గుండా శ్రీనివాస్, మడావి వెంకటేశ్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని ఐబీలో జరిగిన వేడుకల్లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రావుల అనిల్, నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్, మండల అధ్యక్షుడు బొప్పు సుమన్, పట్టణ అధ్యక్షుడు రాందేని చిన్న వెంకటేష్, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ పాల్గొన్నారు.

దండేపలి: మండలంలో జరిగిన వేడుకల్లో ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు లక్ష్మీనారాయణ, ఫసియుల్లా, ఇసాక్, మేకల మాణిక్యం, కరుణాకర్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని మనోవికాస్ మానసిక పాఠశాలలోని విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సేవాదళ్ నాయకులు పండ్లు, బ్రెడ్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో నోముల ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, సంతోష్, లక్ష్మణ్, శ్రీనివాస్, పాషా, తిరుమల్, పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాలలోని చార్వాక ట్రస్టు హాలులో జరిగిన వేడుకల్లో సేవాదళ్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా బీజేపీదే గెలుపు

(5వ పేజీ తరువాయి)


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

రేషన్ బియ్యం అందజేస్తోందన్నారు. కిసాన్‌క్రెడిట్ కార్డుల ద్వారా పదిలక్షల కోట్లకుపైగా రుణాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు కొయ్యల హేమాజీ, రాచర్ల సంతోష్, పుల్గం తిరుపతి, పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి పాల్గొన్నారు.

నెన్నెల: ప్రధాని నరేంద్రమోది 11 ఏళ్ల పాలనలో దేశం అన్నింటా అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ అధ్యక్షతన చిత్తాపూర్‌లో గురువారం వికసిత్ భారత్ సంకల్పసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రమేష్ పాల్గొని మాట్లాడారు. 11 ఏళ్లలో మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు శైలెందర్‌సింగ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకటేష్, అరుణ్, రాజన్న, యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

జన్నారం: గ్రామస్థాయిలో బీజేపీని పటిష్టపరచాలని మంచిర్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎర్రబెల్లి రఘునాథ్ అన్నారు. మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో బీజేపీని పటిష్టపరిచేందుకు ప్రతీకార్యకర్త పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, కొంతం శంకరయ్య, బద్రీనాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇచ్చిన నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి మందమర్రికి చెందిన తవక్కల్ విద్యాసంస్థల ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అబ్దుల్ అజీజ్, పట్టణానికి చెందిన యువకుడు ముజాయిద్ గురువారం హైద్రాబాద్‌లోని సిట్ అధికారుల ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. వీరిద్దరు గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేయగా 2023 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నవంబరు 23న ఎన్నికలు జరగగా ఆనెల మొత్తం వీరిద్దరు ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. వీరు అందుకు సంబంధించిన వాంగ్మూలం ఇచ్చారు. వీరితోపాటు ఇంకా ఎవరైనా జిల్లాలో ఉన్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పోలింగ్ కేంద్రాల హేతబద్ధీకరణ పకడ్బందీగా చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నూతన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా నిర్వహిం చాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. గురువారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటరు గుర్తింపు కార్డులు, కుటుంబ సభ్యుల గుర్తింపు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లు మాత్రమే ఉండాలని, ఎక్కువగా ఉంటే సహాయక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. నూతనంగా గుర్తించబడిన బూత్‌స్థాయి అధికారులు సూపర్ వైజర్లకు ఓటరు జాబితా సవరణపై శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.

గూడులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

గృహ నిర్మాణ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బాన్సీలాల్


జన్నారంలో ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కల్పిస్తున్న పీడీ బన్సీలాల్

దండేపల్లి జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గూడలేని నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని, అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని గృహ నిర్మాణ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బాన్సీలాల్ కోరారు. గురువారం దండేపల్లి మండల పరిషత్ కార్యలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఎంపీడీవో ప్రసాద్‌తో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బన్సీలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం చూపించిన కొలత ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణ దశలోనే ఇంటి విస్తీర్ణం, ఏయే విడతలో డబ్బులు ఏవిధంగా వస్తాయే ముందే వారికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● జన్నారం: మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని హౌజింగ్ పీడీ బన్సీలాల్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇళ్లన నిర్మాణాలను పరిశీలించాలన్నారు. బిల్లులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని అన్నారు. ఎంపీడీవో షరీఫ్, ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలకు ఎంపిక పోటీలు

జన్నారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్రీడాపాఠశాలల ఎంపిక పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు హాజరుకాగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది బాలురు, ఆరుగురు బాలికలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23 నుంచి 26 వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు సాగర్, యాకూబ్, తిరుపతి, కాంతయ్య, స్రవంతి, షరిష్మ ఉన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

దండేపల్లి జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అన్నారు. గురువారం మండలంలోని ద్వారక, వెల్గనూర్ జైథపేట గ్రామాలోని రెవెన్యూ సదస్సు ద్వారా భూ సమస్య పరిష్కరం కోసం రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్‌ఐ భూమన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: భూసమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు గురువారం ముగిశాయి. మండలంలోని పది గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా 252 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు చర్యలు

(5వ పేజీ తరువాయి)

రోగనిరోధనక శక్తి తగ్గడంతో ఇన్‌ఫెక్షన్ల ముప్పు పెరుగుతుందన్నారు. ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలతో తర్వాతి తరాలకు జబ్బు సంక్రమించకుండా జాగ్రత్తపడవచ్చని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: సికిల్ సెల్ వ్యాధిన భారిన పడిన వారికి ప్రభుత్వం తరుపున ఉచితంగా వైద్య సేవలు అందుతాయని కాసిపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి కిరణ్ అన్నారు. గురువారం ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రిలో రోగులకు సికిల్‌సెల్‌పై అవగాహన కల్పించారు. సికిల్‌సెల్ భారినపడ్డవారికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. వారి పర్యవేక్షణలో ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు వ్యాధి ఉన్న వారికి యూనిక్ డిజెబుల్‌టీ ఐడెంటిఫికేషన్ కార్డు ఇస్తామన్నారు. దీనిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సికిల్ బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నెన్నెలలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం


చిన్నగుడిపేటలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

భీమిని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని భీమిని ఎస్‌ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం చిన్నగుడిపేట గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు నిరోధిస్తాయన్నారు. జన సంచారం ఎక్కువగా ఉంటే ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాసిపేట: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. గురువారం దేవాపూర్‌లో ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల నేరాలను నియంత్రించడంతో పాటు నిందితులను గుర్తించవచ్చు. ఇందుకు సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అలాగే గ్రామాల్లోని ప్రధాన కకూడ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కాసిపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని స్టేషన్‌పెద్దనపల్లికి చెందిన వేణుగోపాల్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దొంగతనం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. స్టేషన్ పెద్దనపల్లికి చెందిన వేణుగోపాల్ ఇంట్లో ఈనెల 19న ఉదయం ఇంట్లో ఎవరులేని సమయంలో బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన మహ్మద్‌నదీం అన్సారీ ఇంటితాళం పగులకొట్టి బీరువా నుంచి మూడువేల నగదును చోరీ చేశాడు. గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీచేస్తుండగా మధుర హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ నదీంను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనానికి పాల్పడ్డట్టు నిర్ధారణ అయినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మూడువేల నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



వన మహోత్సవానికి సిద్ధం



నర్సరీల్లో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

- నర్సరీల్లో ఏపుగా పెరిగిన మొక్కలు
- జిల్లాలో 51 లక్షలు నాటడమే లక్ష్యం
- పక్కాగా అమలుకు అధికారుల సన్నాహాలు

గ్రామాల్లో పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వన మహోత్సవాన్ని చేపడుతోంది. ఈ మేరకు రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను సిద్ధం చేశారు. ఈ నెలాఖరు నుంచి జూలై వరకు మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చింతలమానేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెలాఖరులో వనమహోత్సవం నిర్వహించేందుకు అధికారులు మొక్కలు సిద్ధం చేశారు. పచ్చదనం విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. గత ప్రభుత్వం హరితాహారం పేరిట తొమ్మిది విడతలుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పదో విడతలో వర మహోత్సవం పేరిట దీన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ఏడాది ఇప్పటికే జిల్లాలోని ఆయా జీపీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టగా అధికారులు, ప్రజాప్రతి నిధుల భాగస్వామ్యంతో డీఆర్డీఏ, అటవీశాఖల అధికారుల ఆధ్వర్యంలో జూన్ చివరి వారం, జూలై మొదటి వారాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.

సంరక్షణ బాధ్యతలు..

మొక్కల సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిశాఖతో ఆయా ప్రభుత్వ శాఖలను అప్పగించింది. ఈ మేరకు 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీల్లో 51లక్షల మొక్కల పెంపకం పెట్టుకున్నారు. గతేడాది వివిధ శాఖ ల ఆధ్వర్యంలో 53 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత ఏడాది లక్ష్యం కొంత తగ్గించారు. ఈ మేరకు అవసరమైన మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలకు ఒక్కటి చొప్పున నర్సరీ ఏర్పా టు చేసి మొక్కలను పెంచు తున్నారు. గ్రామీణా భివృద్ధి శాఖతో పాటు అటవీశాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్‌తో కలిపి వివిధ శాఖల సమన్వయం తో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియాలో 2.70 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రోడ్లకు ఇరువైపులా..

ప్రభుత్వ, ప్రైవేటు, విద్యాసంస్థలు, రోడ్లకు ఇరు వైపులా ఎక్కువ నీడనిచ్చే మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే వన మహో త్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలను పచ్చద నం, పర్యావరణ పరిరక్షణ వైపు ప్రోత్సహించనున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతీ ఇంటి కి ఆరు పూలు, పండ్ల మొక్కలు అందించాలని నిర్ణయించారు. ప్రజలు ఇంటి ఆవరణలో పెంచుకు నేలా గులాబి, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్లనేరేడు, మునగ, కానుగ, చింత, తులసీ, ఇతర మొక్కలు పంపిణీ చేయనున్నారు.

ఒక్కో నర్సరీలో ఇలా..

జిల్లాలోని ప్రతీ పంచాయతీలో ఒక్కో నర్సరీ ఏర్పాటు చేశారు. సామర్థ్యాన్ని బట్టి 10వేల నుంచి 17 వేల మొక్కల పెంపకం చేపట్టారు. వాతావరణ పరిస్థితులు, పాలిథిన్ సంచుల్లో లోపాలతో కొన్ని మొలకెత్తడంతో వాటి స్థానంలో విత్తనాలు నాటి మొక్కల లక్ష్యాన్ని సాధించారు. జిల్లా వ్యాప్తంగా 51లక్షల మొక్కల పెం పకం లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యం ఇలా..

మండలం	మొక్కల లక్ష్యం (లక్షల్లో)	మండలం	మొక్కల లక్ష్యం (లక్షల్లో)
ఆసిఫాబాద్	2.70	వాంకిడి	2.50
చింతలమానేపల్లి	2	తిర్యాణి	2.30
బెజ్జూరు	2.60	సిర్పూర్(యూ)	1.60
కాగజ్‌నగర్	4	సిర్పూర్(టీ)	1.80
జైనూరు	2	ప్రభుత్వశాఖల లక్ష్యం	(లక్షల్లో)
దహెగాం	2.50	అటవీశాఖ	7.47
కౌటాల	2.50	రెవెన్యూ	0.62
లింగాపూర్	1.60	వ్యవసాయ	0.65
రెబ్బెన	2.50	విద్యాశాఖ	0.4
పెంచికలపేట	1.60	ఆర్‌అండ్‌బీ	0.10

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం తుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సును గురువారం కలెక్టర్ సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులతో సరి చూసి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంట శాల, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, విద్యాశాఖాధికారి ఉదయ్‌బాబు, నాయబ్ తహసీల్దార్ పోచయ్య, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలసేమియా, సికిల్‌సెల్ నివారణే లక్ష్యం

ఆసిఫాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తలసేమియా, సికిల్‌సెల్‌ను 2047 నాటికి పూర్తిగా నివారించడమే లక్ష్యమని ఉప కార్యదర్శి గణేశ్ నాగరాజన్ అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, తలసేమియా, సికిల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ వినోద్‌లతో కలిసి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి తలసేమియా, సికిల్ సెల్‌ను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాలలో అధికంగా ఉన్నందున ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా సికిల్ సెల్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యా సంస్థలలో సికిల్ సెల్ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆయా శాఖాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో ప్రధాన మురికి కాల్వపై అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చేందుకు మున్సిపల్ కమిషనర్ అంజయ్య, టీపీఎస్ యశ్వంత్ ఆధ్వర్యంలో గురువారం పనులను ప్రారంభించారు. స్థానిక వీఐపీ పాఠశాల యాజమాన్యం అదనపు గదులు ప్రధాన మురికి కాల్వపై నిర్మించడంతో పలు మార్లు నోటీసులిచ్చారు. యాజమాన్యం స్పందించక పోవడంతో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గురువారం ఎక్స్‌కవేటర్లతో మున్సిపల్ సిబ్బంది వచ్చి కూల్చివేత పనులు ప్రారంభించారు. ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ మధ్యాహ్నం వరకు కొనసాగించారు. కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ మున్సిపల్ అనుమతులు లేకుండా నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగిస్తామన్నారు. వీఐపీ పాఠశాల కరస్పాండెంట్ సంజయ్ సింగ్ మాట్లాడుతూ తన భవనాన్ని కూల్చివేత న్యాయమైనరయినప్పటికీ ఈ నాలా మీదుగా ఉన్న వాటిని సైతం తొలగించాలని కోరారు. కూల్చివేత సందర్భంగా ఉద్రిక్తతలు తలెత్తకుండా ఉండేందుకు పట్టణ సీఐ ప్రేంసాగర్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఫైర్ సిబ్బంది తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫైర్ ఆఫీసర్ కార్తీక్ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ రూల్స్ పాటించాలని, ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

కౌటాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈవో హనుమంతు ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు శ్యాంరావు, రమేష్, రామారావు, శ్రీనివాస్, సాయికిరణ్, కృష్ణ, సునీల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల విచారణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసుల అధికారులతో గురువారం నెలవారీ నేర సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులలో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయడంతో పాటు బాధితులకు త్వరితగతిన పరిహారం వచ్చేలా చూడాలని అన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్స్‌ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తు రికవరీ చేసి బాధితులకు త్వరగా అందేలా చూడాలన్నారు. వర్షాకాలంలో వరదలు సంభవించినప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాల న్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని సూచించారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వాలీబాల్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో డీఎస్పీలు రామానుజం, విష్ణుమూర్తి, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురువారం సిర్పూర్ (యూ) మండలానికి చెందిన కానిస్టేబుల్ మడావి ఆనంద్‌కుమార్ కాగజ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండె పోటుతో మృతి చెందడంతో అతని భార్య గంగామణికి భద్రత ఎక్స్‌గ్రేషియా కింద రూ.8 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన కానిస్టేబుల్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అంజేసే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. పోలీసు సిబ్బంది, కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనర్చడంతో పాటు వారి కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాణాప్రతాప్, పోలీసు సంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, ఆర్ఐ పెద్దన్న, కార్యాలయ ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న వైరల్ జ్వరాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

సిర్పూర్(టి), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలో రోజు రోజుకు వైరల్ జ్వరాలు ప్రబలుతుండడంతో సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. గురువారం పెద్ద సంఖ్యలో రోగులు జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చారు. సుమారు రెండు వందల మంది ఓపీలో చూపించు కున్నట్లు చెబుతున్నారు. పలువురు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. వాతావరణ మార్పులు చోటు చేసుకోవడంతో వైరల్ జ్వరాలు సోకుతున్నట్లు చెబుతున్నారు.

ఆశ్రమ పాఠశాల పునఃప్రారంభించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని బాలికల ఆశ్రమ పాఠశాల పునఃప్రారంభించాలని కోరుతూ గురువారం ఐటీడీఏ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ శరత్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019లో బాలికల పాఠశాలలో క్రీడా పాఠశాల ప్రారంభించారని చెప్పారు. ఆ సంవత్సరమే పూర్వపు బాలికలను ఆసిఫాబాద్ దగ్గరలో ఉన్న వాంకిడి బాలికల పాఠశాలకు తరలించారని తెపాఆరు. అక్కడ సరైన వసతులు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ఏడాది ఒక బాలిక మరణించిన సంఘటన జరిగిందని, తిరిగి బాలికల పాఠశాలను ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

అధికారులతో పోడు రైతుల వాగ్వాదం

కాగజ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామంలో గురువారం అటవీశాఖ అధికారులతో పోడు రైతుల వాగ్వాదానికి దిగారు. పోడు రైతులు ట్రాక్టర్ పెట్టి భూములు దున్నేందుకు ప్రయత్నించడంతో అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పనులు ప్రారంభించామని, అధికారులు అడ్డుకోవడం సరికాదని రైతులు చెబుతున్నారు. కాగజ్‌నగర్ కార్యాలయానికి వచ్చి భూ రికార్డులను చూపించాలని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఓటరు జాబితా స్పష్టంగా రూపొందించాలి

ఆసిఫాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటరు జాబితా రూపకల్పన, బూత్‌స్థాయి అధికారుల శిక్షణకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల స్థాయి అధికారులకు జూలై 2 నుంచి 17 వరకు శిక్షణ అందించేందుకు అధికారులు తగిన ఏర్పాటు చేయాలని తెలిపారు. నూతన ఓటరు గుర్తింపు కార్డు, కుటుంబ సభ్యుల గుర్తింపు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జుగా పథకంపై గ్రామాల్లో అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌సీఆర్పీ నరేష్

కెరమెరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్(పీఎంజుగా) పథకంను తీసుకు వచ్చిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌సీఆర్పీ నరేష్ అన్నారు. గురువారం మండలంలోని బోరిలాల్‌గూడ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పీఎంజుగాపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జుగా పథకంతో గిరిజనులకు ప్రయోజనమని ఎస్సీఈఆర్పీ ఉయిక శంకర్ అన్నారు. మండలంలోని ఢబోలిలో గురువారం ఆయన గిరిజనులకు పీఎం జుగా పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 102 గ్రామాల్లో పీఎం జుగా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో గ్రామ కార్యదర్శి రాజకుమార్, మాజీ సర్పంచ్ మేస్రాం నాగోరావ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): పీఎంజుగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమిని గ్రామంలో పీఎంజుగా పథకంపై అవగాహన కల్పించారు. పీఎంజుగా పథకం అమలుతో గిరిజన ఆవాసాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీజీబీ మేనేజర్ సత్యకిరణ్, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, నందారాం, ఏపీవో రాజన్న, కార్యదర్శి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ పుష్పలత, నాయకులు సాయి పాల్గొన్నారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు



ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారికి పత్రాలను అందజేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పేదల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు లబ్ధిదారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమి పూజ

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో గురువారం మండల అభివృద్ధి అధికారి రామచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాదవ్ లోకేందర్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చవాన్ సునీల్ ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమి పూజ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు ఆత్రం అనిల్, ఏపీవో చంద్రయ్య, హౌసింగ్ ఏఈ రత్నం, పంచాయతీ కార్యదర్శి ప్రేంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): కంచన్‌పల్లి గ్రామంలో గురువారం ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాణ్ కార్యక్రమంలో భాగం గా ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

● కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు యూనిఫాం ధరించి గురువారం పాఠశాలకు రావడంతో ఎంఈవో హనుమంతు అభినందించారు.

● బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): సలుగుపల్లి నుంచి పెంచికలపేట వరకు మా జీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో గుంతలు పూడ్చారు.

\- మండలంలోని చిన్నసిద్దాపూర్‌కు చెందిన రైతులు ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారు.

● సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ పోరాడుతున్న రైతులకు బేడీలు వేయడం అమానుషమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో అన్నారు.